ఈనాడు
నంద్యాల
మంగళవారం సెప్టెంబరు 1, 2026

కన్నేసి.. మన్నేసి

■ యథేచ్ఛగా ఎర్రవాగు ఆక్రమణ

పట్టణంలో ఆక్రమణలకు గురైన వాగు పరివాహక ప్రాంతం

కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే : స్థలాల ధరలు పెరిగిపోవడంతో కొందరు వాగులు, వంకలపై కన్నేశారు. యథేచ్ఛగా మట్టి వేసి ఆక్రమించేస్తున్నారు. వాటి ఉనికిని కనుమరుగు చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. పెనుముప్పు పొంచి ఉన్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

25 కి.మీ. పొడవునా..

కొలిమిగుండ్ల మండల పరిధిలో సుమారు 25 కిలోమీటర్ల పొడవునా ఎర్రవాగు విస్తరించి ఉంది. ఈ వాగు అవుకు మండలంలోని కొండమనాయునిపల్లె నుంచి ప్రారంభమై కొలిమిగుండ్ల, నాయునిపల్లె మధ్యలో ఉన్న సద్దల వెంకన్న చెరువుకు చేరుతుంది. దీనిద్వారా కొలిమిగుండ్ల తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతున్నాయి. ఈ చెరువు పూర్తిగా నిండిన తర్వాత వాగు నీరంతా కల్వటాల, కోటపాడు మీదుగా సంజామల మండలంలోని రామభద్రునిపల్లె చెరువులోకి చేరుతుంది.

భూగర్భ జలాలు పెరుగుతూ..

వెంకన్న చెరువు కింద సుమారు 600 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే కానాల, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, మంగంపల్లి, మిక్కినేనిపల్లి, రామభద్రునిపల్లె గ్రామాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. ఇంతటి ఉపయోగకరమైన ఎర్రవాగు ఆక్రమణలకు గురవుతోంది. కొలిమిగుండ్లలో వాగుకు ఇరువైపులా కాలనీలు, ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి.

ఎవరూ పట్టించుకోక..

ఊరి మధ్యలో వాగు ఉండటం, వాగుకు ఇరువైపులా స్థలాలు ఉండటంతో అక్రమార్కులు కన్నేశారు. ట్రాక్టర్లతో యథేచ్ఛగా మట్టి తోలి చదును చేసి వాగును పూడ్చేస్తున్నారు. మొదట్లో 100 మీటర్లకుపైగా వెడల్పు ఉండగా.. చివరికి ఆక్రమించుకుంటూ రావడంతో సగానికిపైగా కుంచించుకుపోయిందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా అధికారులు దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఇకనైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

"ఎర్రవాగు పరివాహక ప్రాంతాన్ని ఎవరూ ఆక్రమించకూడదు. క్షేత్రస్థాయిలో వాగును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం" అని కొలిమిగుండ్ల తహసీల్దారు షఫీ తెలిపారు.

మూడు మార్గాలు.. ముప్పతిప్పలు

నంద్యాల పట్టణంలోని నూనెపల్లె వంతెన కింద కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, గిద్దలూరు పట్టణాలకు వెళ్లే ప్రధాన రహదారులు ఒకే ప్రాంతంలో కలుస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఆయా మార్గాల్లో ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో.. ఎవరు ఏమార్గంలో వస్తున్నారో తెలియక ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను నియంత్రించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

సాగని పనులు.. ఎగరని డ్రోన్లు

■ కానరాని మౌలిక వసతులు

డ్రోన్ సిటీ విస్తీర్ణం : సుమారు 600 ఎకరాలు
ఇప్పటివరకు అభివృద్ధి చేసింది : 118.29 ఎకరాలు
అందుబాటులోకి తెచ్చిన ప్లాట్ల సంఖ్య : 15
కేటాయించిన ప్లాట్ల సంఖ్య : 8 వరకు

ఈనాడు, కర్నూలు, ఓర్వకల్లు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డ్రోన్ సిటీ పనులు ఆశించినస్థాయిలో సాగడం లేదు. ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామ పరిధిలో 600 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ సిటీ నిర్మాణానికి వీలుగా ఏపీఐఐసీ అధికారులు లేఅవుట్ అభివృద్ధి చేస్తున్నారు. కాగా ఇప్పటివరకు నీరు, విద్యుత్తు, రహదారుల సదుపాయాలు అందుబాటులో లేవు. గత నెల 18వ తేదీన సీఈవోల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు హడావుడిగా కొన్ని రహదారులు నిర్మించారు. వీటిపై తారు వేయలేదు.

అనుమతులకు ఎదురుచూపులే..

డ్రోన్ సిటీలో సుమారు ఎనిమిది మందికి భూములు కేటాయించారు. వారిలో కొందరు పరిశ్రమ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ నేటివరకు ఏపీఐఐసీ అధికారులు అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే నిర్మాణాలు మొదలుపెట్టాలని చెబుతుండటంతో పారిశ్రామికవేత్తలకు ఏమి చేయాలో పాలుపోవడంలేదు.

లక్ష్యానికి ఆమడదూరంలో..

రాష్ట్రంలో వంద డ్రోన్ సంస్థలు ఏర్పాటయ్యేలా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డ్రోన్ సిటీని తెరపైకి తెచ్చింది. సంస్థలకు పలు రాయితీలు ఇవ్వడంతోపాటు వివిధ వెసులుబాట్లు కల్పించింది. డ్రోన్ సిటీలోనే అన్ని సంస్థలు వినియోగించుకునేలా పరిశోధన కేంద్రాలు, టెస్టింగ్ ట్రాక్‌లు, డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తోంది. దీంతోపాటు డ్రోన్ కంపెనీలు తమ ఉత్పత్తులను పరీక్షించుకొనేందుకు, విక్రయించుకోవడం, ఎగుమతులు చేసేందుకు అవసరమైన అన్నిరకాల అనుమతులు కూడా డ్రోన్ సిటీలోనే ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. కాగా అత్యంత కీలకమైన ఆయా వ్యవస్థలు అందుబాటులోకి రాకపోవడంతో పెట్టుబడులు పెట్టాలనుకున్న వారికి నిరీక్షణ తప్పడంలేదు. వంద డ్రోన్ సంస్థలను ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నా ఇప్పటివరకు కొన్ని సంస్థలు మాత్రమే ముందుకు వచ్చాయి.

రూ.500 కోట్లు కేటాయించినా..

▸▸ డ్రోన్ సిటీని ప్రపంచ స్థాయిలోనే అధునాతనంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఏపీలో డ్రోన్ రంగాన్ని గణనీయంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో 2024-29 మధ్య రూ.500 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. అంత భారీ మొత్తం డ్రోన్ల రంగానికి ప్రభుత్వం కేటాయించినా అధికారులు మాత్రం ఆయా నిధులను ఉపయోగించుకోవడంలో విఫలమవుతున్నారు.

▸▸ డ్రోన్ సిటీకి ఉపయుక్తంగా ఉంటుందన్న ఉద్దేశంతో ఉప్పలపాడు వైపు నుంచి ఒక రహదారిని సుమారు రూ.4 కోట్లతో నిర్మించారు. ఆ తర్వాత అది ప్రస్తుతానికి ఉపయుక్తంగా లేదని మరో రోడ్డు నిర్మించడం గమనార్హం.

గడువులోగా ప్రతిపాదనలు అందించాలి

సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛాంధ్ర అవార్డుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని అన్ని శాఖలు, సంస్థలు చురుగ్గా పాల్గొని ఉత్తమ ప్రతిపాదనలను గడువులోగా సమర్పించాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. స్థానిక పీజీఆర్‌ఎస్ హాలులో స్వచ్ఛాంధ్ర అవార్డులపై ఆమె సోమవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు రాష్ట్రస్థాయిలో అత్యధిక అవార్డులు దక్కేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో రామునాయక్, పీజీఆర్‌ఎస్ నోడల్ అధికారిణి ఉమామహేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల రైతులకు సమన్యాయం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు విడుదల చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు చరిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. వారు సోమవారం నంద్యాలలో మాట్లాడారు. 1996లో చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, మూడు దశాబ్దాల అనంతరం ఆయనే ప్రారంభోత్సవం చేయడం అరుదైన విషయమన్నారు. పర్యాటక రంగంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పర్యాటకాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని వివరించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు చేసింది ఏమీలేదని అన్నారు. ఇప్పుడు చంద్రబాబు ప్రారంభిస్తే క్రెడిట్ కొట్టేయాలని చూడడం విడ్డూరంగా ఉందన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తోందని అన్నారు. అన్ని ప్రాంతాల రైతులకు న్యాయం జరిగేలా సమతుల్య విధానంలో అడుగులు వేస్తోందని వివరించారు. సంక్షేమంతోపాటు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర మాజీ కార్యదర్శి వి.రామచంద్రరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో చర్చిస్తున్న మంత్రులు ఫరూక్, దుర్గేశ్

ప్రహ్లాదరాయలుకు మహా ఉత్సవం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం మహా రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. మూల బృందావనాన్ని స్వర్ణ కవచాలతో విశేషంగా అలంకరించి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మహా మంగళహారతి ఇచ్చారు. ప్రహ్లాదరాయలుకు ఊంజల్ సేవ చేసి వసంతోత్సవం జరిపారు. అనంతరం స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలో ఆశీనులు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం అశేష భక్తజన సందోహం నడుమ మహా రథోత్సవం కనులపండువగా సాగింది. లక్షలాది మంది ప్రత్యక్షంగా వీక్షించి మొక్కులు తీర్చుకున్నారు. – న్యూస్‌టుడే, మంత్రాలయం, మంత్రాలయం గ్రామీణం

మూల బృందావనానికి హారతి ఇస్తున్న పీఠాధిపతి
రథం వద్దకు ఊరేగింపుగా వస్తున్న ఉత్సవమూర్తి

పనుల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

బనగానపల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బనగానపల్లి పట్టణంలో జరుగుతున్న వివిధ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. పట్టణంలోని కరీంబాగ్ కాలనీ, పంచమపేట, బీసీ కాలనీ, బస్టాండు ఏరియా, ఈద్గానగర్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను సంబంధిత అధికారులతో కలిసి మంత్రి బీసీ పరిశీలించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, కష్టపడి చదువుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పట్టణంలో రూ.30 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. జుర్రేరు వాగు సుందరీకరణ పనులు త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సహకారం ఉంటే మొదటి దశ పనులు పూర్తి చేసి రెండో దశ ప్రారంభిస్తామన్నారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు.

మెరిట్ తుది జాబితా విడుదల

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులకు సంబంధించి మెరిట్ తుది జాబితా (డీఎస్సీ) విడుదల చేసినట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంధులు, బధిరులు, శారీరక విభిన్న ప్రతిభావంతుల తుది జాబితా, తిరస్కరణ జాబితాను కర్నూలులోని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయంలోని నోటీసు బోర్డుతో పాటు నంద్యాల.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. అభ్యర్థులు తమ వివరాలను జాబితాలో చూసుకోవచ్చని వెల్లడించారు.

జనరిక్తహస్తం

సర్వజన వైద్యశాలలోని జనరిక్ కేంద్రం

■ ఔషధ కేంద్రాల ఏర్పాటులో వెనుకబాటు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఏటా పెరిగిపోతున్న ఔషధాల ధరలు.. పేదల జేబులను ఖాళీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జనరిక్ మందులను ప్రజలకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రధానమంత్రి భారతీయ జనరిక్ ఔషధి ప్రయోజన్ పేరుతో 723 రకాల మందుల ధరలు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 2015లో అన్న సంజీవని దుకాణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పేదలకు ఎంతో ప్రయోజనకరమైన ఈ దుకాణాల ఏర్పాటులో ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారులు వెనుకబడ్డారు. ప్రస్తుతం 29 జన ఔషధి దుకాణాలు మాత్రమే ఉన్నాయి. మరోవైపు సరైన ప్రచారం కానరావడం లేదు.

ఆసక్తి ఉంటే మంజూరు

స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలు జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. వారి కుటుంబ సభ్యులు గానీ.. దగ్గరి బంధువుల్లో ఎవరికైనా డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్హత ఉండాలి. సదరు సభ్యురాలు కొనసాగుతున్న సంఘానికి సంబంధించిన సమాఖ్య తీర్మానం చేస్తే దుకాణం ఏర్పాటుకు జిల్లా ఔషధ నియంత్రణాధికారి అనుమతిస్తారు. విద్యార్హత ధ్రువపత్రాలతో స్త్రీనిధి విభాగం అధికారులను కలిసి దరఖాస్తు సమర్పించాలి. వారు అర్హులుగా భావిస్తే దుకాణం మంజూరు చేస్తారు.

"జనరిక్ దుకాణం ఏర్పాటు చేయాలనుకునే వారికి ప్రత్యేకంగా యాప్ ఉంది. ఇందులో అర్హులకు అనుమతి పత్రం ఇస్తారు. దీనిని ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయంలో ఇస్తే అనుమతిస్తారు" అని ఔషధ నియంత్రణ పరిపాలనాధికారి హరిహర తేజ చెప్పారు.

బ్రాండు పేరుతో బాదుడు

జనరిక్ మందులు రాస్తే వైద్యులకు కమీషన్లు అందవు. అదే బ్రాండెడ్ ఔషధాలు రాస్తే నెలనెలా రూ.లక్షల్లో అందుతాయి. దీంతో వైద్యులెవరూ జనరిక్ మందులు రాయడం లేదు. పైగా సరిగా పని చేయవని దుష్ప్రచారం చేస్తుండటంతో రోగులు వాటిని కొనేందుకు వెనకాడుతున్నారు. పెద్దాసుపత్రుల్లో జనరిక్ దుకాణాలున్నా.. వాటిల్లో మందులు కొనుగోలు చేసేవారు 30 నుంచి 40 శాతం లోపే ఉంటున్నారు. ఈ ఔషధాల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించడంపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణాల్లో వ్యాపారం జరగక మూతపడ్డాయి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొంత ఆదరణ

కర్నూలు జిల్లాలో 18, నంద్యాల జిల్లాలో 11 జన ఔషధి దుకాణాలు ఉన్నాయి. కర్నూలు నగరంలోని సర్వజన వైద్యశాలలో 3, వివిధ కాలనీల్లో 4 కేంద్రాలున్నాయి. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, పెద్దహరివాణం, నంద్యాల, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు లాంటి పట్టణ ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటు చేశారు. వీటిలోనూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నవి మాత్రమే నడుస్తున్నాయి.

రెడ్‌క్రాస్ అభివృద్ధికి చేయూతనివ్వండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్‌లో ఉద్యోగులందరూ సభ్యులుగా నమోదు కావాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. స్థానిక పీజీఆర్‌ఎస్ హాల్‌లో సోమవారం రెడ్‌క్రాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ బలోపేతం కోసం జడ్పీ సిబ్బంది 30 మంది జీవితకాల సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. డీఆర్వో, ఆర్డీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి సభ్యత్వం పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మన్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఒట్టిపోయినది

■ వీబీఆర్ నుంచి ఆగిన నీటి సరఫరా

పూర్తిగా ఎండిపోయిన కుందూ నది

ప్రస్తుతం ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సమస్యలు వేధిస్తున్నాయి. ప్రాజెక్టులకు వరద ప్రవాహం అంతంతమాత్రంగానే ఉంది. ఒక్క శ్రీశైలం జలాశయం పరిస్థితి మాత్రం ఆశాజనకంగా ఉంది. కేవలం తాగునీటికి మాత్రమే వినియోగించుకొనేలా ప్రభుత్వం తగిన ప్రణాళికలు రూపొందించింది. ఎక్కడా మంచినీటి సమస్యలు తలెత్తకుండా ఎక్కడికక్కడ జలాశయాలను నింపాలని ఆదేశించింది. మరోవైపు జలమండలి అధికారులు వెలుగోడు జలాశయం నుంచి కుందూ తీర గ్రామాల దాహార్తి తీర్చే ఉద్దేశంతో 0.5 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు. దీంతో తీర ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ఐదు రోజుల్లోనే..

కుందూ నదికి నీరు వదిలిన కేవలం ఐదు రోజుల్లోనే నీటి సరఫరా ఆగిపోయింది. చుక్క నీరు లేకపోవడంతో నది ఎడారిని తలపిస్తోంది. తీరం వెంబడి ఉన్న నీటి పథకాలకు చుక్కనీరు సరఫరా కావటం లేదు. దీంతో నీటి ఎద్దడి నెలకొంది. మరోవైపు వర్షాలు పడకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (వీబీఆర్) నుంచి నీరు విడుదల చేసి తాగునీటి సమస్యలు తీర్చాలని జనం విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల

మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల వెండి రథోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు అర్చకులు సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. మంగళ హారతులు సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులు చేసి పూజలు చేశారు. శివనామ స్మరణల మధ్య వెండి రథోత్సవాన్ని వైభవంగా జరిపారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ బదిలీ

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ బదిలీ అయ్యారు. ఆయనకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ సహాయ డైరెక్టర్‌గా పదోన్నతి లభించడంతో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నంద్యాల ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వోగా డా.శారదాబాయిని నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు వైద్య కళాశాల డీసీఎస్ డా.ఆర్.స్వర్ణకుమారిని కర్నూలులోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం (పురుషులు) ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వీరపాండియన్ ఉత్తర్వులు జారీ చేశారు.

పత్రం అందక.. హక్కులు దక్కక

■ సీసీఆర్ కార్డుల పంపిణీలో తీవ్ర జాప్యం

కర్నూలు వ్యవసాయం, న్యూస్‌టుడే : పలువురు కౌలు రైతులు భూ యజమానులకు ముందస్తు కౌలు చెల్లించి ఏటా పంటలు పండిస్తున్నారు. వీరికి నిబంధనల ప్రకారం పంట సాగుహక్కు పత్రం (సీసీఆర్ కార్డు) అందించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ చివరి దశకు వచ్చినా చాలామందికి కార్డులు అందలేదు. ఫలితంగా ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు కోల్పోతున్నారు.

ప్రయోజనాలు దరిచేరక..

సీసీఆర్ కార్డు ఉంటేనే పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. కార్డులు సకాలంలో అందకపోవడంతో పొలాలను కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నా పంటల బీమా ప్రీమియం చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావంతో బెట్ట పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కౌలుదారులకు కార్డులు అందకపోవడంతో బీమా చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. రాయితీపై విత్తనాలు, ఎరువులు, అన్నదాత సుఖీభవ, పంట ఉత్పత్తులను మద్దతు ధరకు అమ్ముకోవడం తదితరాలన్నింటికీ ఈ-పంట నమోదు తప్పనిసరి చేశారు. సీసీఆర్ కార్డులు లేకపోవడంతో ఈ-పంట నమోదు చేయడం లేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమన్వయ లోపంతో..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష మందికిపైగా కౌలుదారులున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందు ఏప్రిల్, మే నెలల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి కౌలుదారులను గుర్తించాలి. భూ యజమానులను ఒప్పించి కౌలుదారులకు పంట సాగు హక్కు పత్రం (సీసీఆర్ కార్డు) అందించాల్సి ఉంది. ఈ కార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుంది. ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లోపించడంతో చాలామందికి కార్డులు అందలేదు.

2026-27 సంవత్సరానికి సీసీఆర్ కార్డుల లక్ష్యం, పంపిణీ వివరాలు

జిల్లా	లక్ష్యం	పంపిణీ చేసింది
కర్నూలు	30,000	13,879
నంద్యాల	25,000	17,497

పంట రుణమేదీ..

పంట సాగు హక్కు పత్రం (సీసీఆర్ కార్డు) ఉంటే బ్యాంకుల్లో ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.లక్ష వరకు పంట రుణం పొందే వీలుంది. కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావడం లేదు. కర్నూలు జిల్లాలో 30 వేల మంది కౌలుదారులకు సీసీఆర్ కార్డులు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 13,879 మందికే అందజేశారు. పంట రుణాల విషయానికి వస్తే 62 మంది కౌలుదారులకు రూ.65 లక్షల మేర పంట రుణాలు ఇచ్చినట్లు జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఎల్‌డీఎం వివరించారు. కర్నూలు జిల్లా పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.45 కోట్ల మేర పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నంద్యాల జిల్లాలో రూ.37.50 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా 50 మందికి కనీసం రూ.50 లక్షలు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

(c) eenadu

కూరగాయల తోట.. సస్యరక్షణతోనే లాభాల పంట

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కూరగాయల పంటలకు సోకే తెగుళ్లతో దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. వాటిని సమర్థంగా నివారిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఆళ్లగడ్డ ఏవో కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

సాగులో ఉన్న కాకర

● **మొజాయిక్ తెగుళ్లు:** ఈ తెగులు సోకినప్పుడు ఆకులపై లేత ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ లేదా పసుపు రంగు మచ్చలు చదరంగం గడుల(మొజాయిక్) మాదిరి ఏర్పడతాయి. ఆకులు ముడుచుకుపోయి, కాయలు వంకర్లు తిరుగుతాయి. దోస, పుచ్చ, కాకర, మిరప, టమాటా పంటలకు దోస మొజాయిక్ వైరస్ సోకుతుంది.

● **ఆకుముడత తెగుళ్లు:** ఆకుముడత వైరస్ మిరపలో అధికంగా ఉంటుంది. ఆకులు పైకి లేదా కిందకు ముడుచుకుపోవడం, గిడస బారడం, చిన్నగా మారి గుత్తులుగా మారుతాయి. మొక్క ఎదుగుదల పూర్తిగా ఆగిపోతుంది. టమాటాలో ఆకుముడత వైరస్‌తో ఆకుల అంచులు పసుపు రంగులోకి మారి పైకి ముడుచుకుంటాయి. దీనిని తెల్లదోమ వ్యాప్తి చేస్తుంది.

● **కీటకాల నియంత్రణ మందులు:** వైరస్ ఒకసారి మొక్కకు సోకిన తర్వాత పూర్తిగా తొలగించడం అసాధ్యం. 5 శాతం వేప గింజల కషాయం లేదా అజాడిరక్టిన్ 10000 పీపీఎం లీటరు నీటికి 2 మి.లీ చొప్పున పిచికారీ చేసి రసం పీల్చే పురుగులను మొదటి దశలో అరికట్టవచ్చు.

రైతేరాజు

యాజమాన్య పద్ధతులు: ● వైరస్ రహిత, ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే వాడాలి. ● ఒకే రకమైన పంటలను వరుసగా వేయకూడదు. ఆరోగ్యవంతమైన నారును వాడుకోవాలి. నారుమళ్లను నెట్‌హౌస్‌లో పెంచితే మంచిది. ● టమాటా, వంగ, మిరప వంటి కూరగాయల నారును నాటే ముందు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ ఒక లీటరు నీరు కలిపిన ద్రావణంలో ముంచి నాటుకోవాలి. విత్తే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. ● జొన్న, సజ్జ లేదా మొక్కజొన్న వంటి ఎత్తైన పంటలను 2-3 వరుసల్లో పొలం చుట్టూ వేయడంతో రసం పీల్చే పురుగులు నేరుగా ప్రధాన కూరగాయ పంటపై పడకుండా అడ్డుగోడలా పనిచేస్తాయి. ● జిగురు అట్టలు వాడటంతో వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే పురుగులను ప్రారంభంలోనే నాశనం చేయవచ్చు. ఎకరాకు కనీసం 15 నుంచి 20 జిగురు అట్టలను అమర్చాలి.

చెత్తమార్గం.. పాదచారులకు సంకటం

కర్నూలు నగరంలోని పాత ఈద్గా రైల్వే ట్రాక్ సమీపంలో పారిశుద్ధ్య సిబ్బంది మురుగు కాలువలోని చెత్త, వ్యర్థాలను తొలగించి రోడ్డుపైనే పడేశారు. రోడ్డుకు అటువైపు నూతన రైల్వే ట్రాక్ ఏర్పాటులో భాగంగా పిల్లర్ల నిర్మాణం సాగుతోంది. దీంతో వాహనాలను ఒకవైపే అనుమతిస్తున్నారు. దీంతో ఈ రహదారిలో తీవ్ర రద్దీ ఉంటోంది. వందలాది వాహనాల మధ్య పాదచారులు వెళ్లాలంటే కష్టంగా ఉంది. దీనికితోడు రోడ్డుపై మురుగుతో కూడిన వ్యర్థాలను కుప్పగా వేయడంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పాదచారులు ఇబ్బందులు పడ్డారు. – న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

పారిన గంగ.. తీరిన బెంగ

బనగానపల్లి మండలంలోని ఎస్సార్బీసీ కాల్వలు జలకళను సంతరించుకున్నాయి. సోమవారం ఆయా గ్రామాల్లోని కాల్వలకు నీరు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గోరుకల్లు రిజర్వాయరు నుంచి అధికారులు నీరు వదలడంతో కాల్వలు నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

వెలిగొండ ప్రాజెక్టు చరిత్రలో నిలిచిపోతుంది

బనగానపల్లి, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మొదటి దశ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం ప్రారంభించిన నేపథ్యంలో బనగానపల్లిలో మంత్రి బీసీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నీరిచ్చి చరిత్ర సృష్టించారని కొనియాడారు. ఈ ప్రాజెక్టుతో తొలిదశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. 4 లక్షల మందికి తాగునీటి భరోసా కల్పించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. కేవలం 48 రోజుల్లోనే రూ.768 కోట్ల నిధులను నిర్వాసితులకు పరిహారం పంపిణీ చేసిన ఘనత ఉందన్నారు. మూడు జిల్లాల్లో 30 మండలాల్లో ప్రజలు తాగునీటి కష్టాలు తీరిపోతాయన్నారు. గత ప్రభుత్వం పనులు పూర్తి చేయకుండా నిర్వాసితులకు పైసా ఇవ్వకుండా నాటకాలు ఆడిందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో మొదటి దశ పనులు పూర్తి చేశామని మంత్రి బీసీ సంతోషం వ్యక్తం చేశారు.

మంత్రిని కలిసిన వక్ఫ్ ట్రైబ్యునల్ సభ్యులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ సభ్యులుగా నియమితులైన మౌలానా మహ్మద్ హుస్సేన్ అహ్మద్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక మంత్రి కార్యాలయంలో సోమవారం ఆయన ఈ మేరకు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో, వివాదాల పరిష్కారంలో న్యాయబద్ధంగా వ్యవహరించి పేద, మైనార్టీ వర్గాల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూక్ సుబ్లీ, కర్నూలు ప్రభుత్వ ఖాజీ సలాం మౌలానా, ఇలియాస్, మనియార్ ఖలీల్, మిద్దె హుస్సేన్, అస్మద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రితో మహ్మద్ హుస్సేన్ అహ్మద్ తదితరులు

సందేహాలు సమాధానాలు

స్వల్పకాలిక రకాల సాగుతో ధీమా

? కంది పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. అక్కడక్కడా పురుగు కనిపిస్తోంది. – రామసుబ్బారెడ్డి, పాతపాడు.

✓ దీన్ని మారుక మచ్చల పురుగు లేదా గూడు పురుగు అంటారు. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లేదా థయోడికార్బ్ 1 గ్రా. , లేదా నోవాల్యూరాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా ల్యాంబ్డా సైహలోత్రిన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి మందులు మార్చి వారం రోజుల కొకసారి పిచికారీ చేయాలి.

– డా.ధనలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్త

- న్యూస్‌టుడే, బనగానపల్లి

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: సెప్టెంబర్‌లో ఆలస్యంగా విత్తుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడినప్పుడు రైతులు ప్రాంతం, నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకుని సాగు చేసుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు. సాగు చేసుకోదగిన పంట రకాలు వివరించారు.

కంది రకాలు : సెప్టెంబర్‌లో స్వల్పకాలిక కంది రకాలను విత్తుకోవచ్చు. ఐసీపీవీ-25444, ఐసీపీవీ-2144, టీఎస్-3ఆర్, ఎన్‌పీఏఎం-88, పీఆర్‌జీ-176 రకాలు అనుకూలంగా ఉంటాయి. వీటి పంటకాలం సుమారు 120-130 రోజులు. సరైన యాజమాన్య పద్ధతులతో ఎకరాకు సుమారు 6-7 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చు.

తేలికపాటి నేలల్లో.. వచ్చే నెలలో తేలికపాటి నేలల్లో జొన్న, కొర్ర, సజ్జ, పెసర, అలసంద, మేత జొన్న, ఉలవలు సాగు చేసుకోవచ్చు.

■ **జొన్న:** నంద్యాల తెల్ల జొన్న.. పంట కాలం - 100 నుంచి 115 రోజులు, ఎకరాకు సుమారు 15 క్వింటాళ్ల దిగుబడి.

■ పెసర- ఎల్‌జీజీ-607 రకం - పంటకాలం 70 నుంచి 75 రోజులు, ఎకరాకు 8-9 క్వింటాళ్ల దిగుబడి.

■ **కొర్ర:** సూర్యనంది-75 రోజులు, దిగుబడి ఎకరాకు 8-9 క్వింటాళ్లు

■ **సజ్జ:** ఏబీవీ-04 రకం. పంట కాలం సుమారు 86 రోజులు, ఎకరాకు 10-12 క్వింటాళ్ల దిగుబడి.

■ **బరువైన నల్లరేగడి నేలల్లో..** బరువైన నల్లరేగడి నేలల్లో ఆముదం, జొన్న, కొర్ర, పెసర, అలసంద, ఉలవలు సాగు చేసుకోవచ్చు.

■ **ఆముదం:** ఐసీహెచ్-5 రకం.. పంట కాలం సుమారు 90-150 రోజులు, ఎకరాకు సుమారు 10 క్వింటాళ్ల దిగుబడి.

■ **అలసంద:** టీపీటీసీ-29 రకం.. పంటకాలం సుమారు 90 రోజులు, ఎకరాకు సుమారు 10 క్వింటాళ్ల దిగుబడి. అదే విధంగా నేల పరిస్థితులు, వర్షపాతం, నీటి లభ్యత, స్థానిక వాతావరణ పరిస్థితులకు బట్టి ఇతర స్వల్పకాలిక జొన్న, కొర్ర, పెసర, ఉలవ రకాలను కూడా సాగు చేసుకోవచ్చు.

ఎల్‌నినో ప్రభావం.. ఉల్లి యాజమాన్యం

చాగలమర్రి, న్యూస్‌టుడే: రైతులకు తక్కువ వ్యవధిలో మంచి ఆదాయాన్ని అందించే వాణిజ్య పంటల్లో ఉల్లిగడ్డ ప్రధానమైంది. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడి ఉల్లిగడ్డ పగలడం, అకాలంగా పూత రాలడం, ఎండదెబ్బ తగలడం, తామర పురుగుల ఉద్ధృతి ఎక్కువ కావడం జరుగుతుంది. దీంతో పంటలను కాపాడుకోవడానికి వ్యూహాత్మక నీటి పొదుపు పద్ధతులు, సూక్ష్మ వాతావరణ నిర్వహణను అమలు చేయడం అత్యవసరమని ఉద్యానవన శాఖ అధికారి దస్తగిరి తెలిపారు.

● **మొలకెత్తడం:** ఎల్‌నినో పరిస్థితుల వల్ల అధిక ఉష్ణోగ్రతలు, తేమ కొరత ఏర్పడి మొలక శాతం తగ్గడం, నారు పెరుగుదల మందగించడం, మొక్కలు వాడిపోవడం, తామర పురుగుల ఉద్ధృతి పెరగడం వంటి సమస్యలు ఎదురవుతాయి. తీవ్రమైన వేడి గాలుల నుంచి లేత మొక్కలను రక్షించడానికి, 50 శాతం నీడనిచ్చే నెట్లతో కూడిన ఎత్తైన మడుల్లో నారును పెంచుకోవాలి.

● **సరైన సాంద్రత:** మొక్కల ఆకులు నీళ్లను త్వరగా కప్పివేసి, నీరు ఆవిరి కాకుండా తగ్గించేలా చూసేందుకు మొక్కల మధ్య తక్కువ దూరాన్ని పాటించాలి. వేడి వాతావరణంలో అధిక మోతాదులో నత్రజని వేయడం అరికట్టాలి.

● **గంధకం వాడకం:** గడ్డ గాటు, వ్యాపార నాణ్యత, నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఎకరాకు 15-20 కిలోల గంధకాన్ని వేసుకోవాలి.

● **మొక్కలు స్థిరపడే దశ:** వర్షాలు లేక తేమ కొరత ఏర్పడుతుంది. దీంతో అధిక సంఖ్యలో మొలకలు చనిపోవడానికి దారితీస్తాయి. నేల ఉష్ణోగ్రతను తగ్గించడానికి, తేమను నిలుపుకోవడానికి, వరుసల మధ్య 5 సెం.మీ. ధాన్యం గడ్డిని, చెరుకు వ్యర్థాల మల్చ్‌ను వేసుకోవాలి.

● **శాఖీయ దశ:** ఉల్లిపాయల్లో వేరు పెరుగుదల పరిమితంగా ఉండి, ఆకుల ఉత్పత్తి కుంటుపడుతుంది. సూక్ష్మ పోషకాల మిశ్రమం 3 నుంచి 4 గ్రా. లీటరు నీటికి కలిపి నెలకు రెండు సార్లు పిచికారీ చేయాలి.

● **గడ్డ పెరుగుదల దశ:** ఈ దశలో పంట అకాలంగా పక్వానికి రావడం, గడ్డ పరిమాణం చిన్నగా ఉండి పగలడం లేదా ఆకారం మారిపోవడం వంటివి జరిగి దిగుబడి తగ్గుతుంది. కయోలిన్ వంటి యాంటి ట్రాఫరెంట్లు 50 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

● **పరిపక్వత, కోత దశ:** నీటి ఒత్తిడికి గురైన మొక్కల మెడ మందం తగ్గి కుళ్లిపోవడం, నిల్వ సామర్థ్యం తగ్గి గడ్డలు పాడవుతాయి.

దద్దణాల చెరువుకు సాగునీరు విడుదల

బనగానపల్లి, న్యూస్‌టుడే: ఎస్సార్బీసీ కాలువకు నీరు రావడంతో సోమవారం దద్దణాల చెరువుకు ఎత్తిపోతల ద్వారా సాగునీరు విడుదల చేశారు. యాగంటి ఆలయం ఛైర్మన్ బండి మౌళీశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ భూషన్న, తెదేపా నాయకులు సంకేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి జుర్రేరు ఎత్తిపోతల పథకం నుంచి చెరువుకు నీరు విడుదల చేశారు. ఎత్తిపోతల పథకం మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో ఎస్సార్బీసీ కాలువకు నీరు వచ్చిందన్నారు. దద్దణాల చెరువులో నీరుంటే చుట్టుపక్కల 15 గ్రామాలకు సాగు, తాగునీటి కష్టాలు తీరిపోతాయన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు రాకపోవడంతో చెరువు ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాలువకు నీరు వచ్చినన్ని రోజులు ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందిస్తే వచ్చే వేసవిలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని అన్నారు. తెదేపా నాయకులు భాస్కరరెడ్డి, గోపీనాథ్, జయనాయక్, కాంత్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎత్తిపోతల ద్వారా సాగునీరు విడుదల చేస్తున్న తెదేపా నాయకులు

మల్లన్న సేవలో మంత్రి పార్థసారథి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కె.పార్థసారథి ఆదివారం దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ మహాద్వారం వద్ద దేవస్థానం డిప్యూటీ ఈవో చంద్రశేఖర్, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శ్రీస్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేదాశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంత్రి వెంట సీఐ జీవన్ గంగనాథ్‌బాబు ఉన్నారు.

మంత్రికి స్వామివార్ల జ్ఞాపిక బహూకరిస్తున్న ఆలయ అధికారి

నేత్రపర్వంగా పల్లకి సేవ

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఛైర్మన్ మౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నేత్రపర్వంగా పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకిని అందంగా అలంకరించి ఉత్సవ విగ్రహాలు కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రాకార ఉత్సవం గావించారు. కార్యక్రమంలో పాతపాడు మాజీ సర్పంచి మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

బకాయిలు వెంటనే విడుదల చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ రామచంద్రరావు డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డీఏ బకాయిలను చెల్లించాలని వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. స్థానిక పీజీఆర్ఎస్‌లో సోమవారం ఏపీజేఏసీ అమరావతి జిల్లా సంఘం నాయకులు కలెక్టర్ రాజకుమారిని కలిసి ఉద్యమ కార్యాచరణ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయుడు, జిల్లా ఉమెన్ వింగ్ ఛైర్మన్ విజయ్‌కుమార్, కార్యదర్శి అన్నమ్మ, మాధవిరెడ్డి, మయూరి, సరస్వతి భాయి, రాష్ట్ర కార్యదర్శి విజయశేఖర్, కోశాధికారి నాగరాజు, రామసంజీవరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీజేఏసీ అమరావతి జిల్లా సంఘం నాయకులు

సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: అర్జీదారుడు సంతృప్తి పడేలా సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. వినతులు రీఓపెన్ కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె పేర్కొన్నారు. స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. కార్యక్రమానికి 272 వినతులు అందాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి అర్జీదారుడి వినతిని నాణ్యతతో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బరువు ఎత్తాడు.. పతకం పట్టాడు

◆ వెయిట్ లిఫ్టింగ్‌లో ఆదోని యువకుడి ప్రతిభ

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఓ వైపు చదువుతూనే మరోవైపు వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నాడు ఆదోనికి చెందిన డిగ్రీ విద్యార్థి బావిగడ్డ వీరేశ్. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటుతున్నాడు. ఇటీవల తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. వెయిట్ లిఫ్టింగ్ పోటీలో రాణిస్తున్న ఈ యువ విద్యార్థిపై న్యూస్‌టుడే ప్రత్యేక కథనం..

● కౌతాళం మండలం తోవి గ్రామానికి చెందిన బావిగడ్డ అయ్యన్న, హనుమంతమ్మ దంపతుల కుమారుడు బావిగడ్డ వీరేశ్ ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ డిగ్రీ చదువుతున్నాడు. ఓ వైపు చదువుతూనే మరోవైపు వెయిట్‌లిఫ్టింగ్‌లో సాధన చేస్తున్నాడు. కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం ప్రోత్సహించడంతో పాటు కళాశాల పీడీ ఎర్రిస్వామి, కర్నూలుకు చెందిన శాప్ కోచ్ యూసుఫ్ బాషా వద్ద కర్నూలు నగరంలోని స్పోర్ట్స్ అకాడమిలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. గత నెల 24 నుంచి 27వ తేదీలలో తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 65 కిలోల కేటగిరిలో బరిలో దిగాడు. వెయిట్ లిఫ్టింగ్ స్నాచ్ విభాగంలో 110 కిలోలు, క్లీన్‌అండ్‌జర్క్ విభాగంలో 132 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ నెల 29న తిరుపతిలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో బరువు ఎత్తుతున్న వీరేశ్

రాష్ట్రస్థాయిలో 8 పతకాలు సొంతం

జూనియర్, అండర్-23 తదితర విభాగాల్లో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఇప్పటివరకు 5 బంగారు పతకాలు, 3 రజత పతకాలు సాధించాడు. 2023 అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగో స్థానం, 2024 హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జూనియర్ జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలో టాప్-10లో నిలిచి ప్రతిభ చాటాడు. జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు వీరేశ్ న్యూస్‌టుడేకు తెలిపాడు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని హెచ్‌కొట్టాల గ్రామ సమీపంలో 340బి జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. నంద్యాల మండలం పుసులూరు గ్రామానికి చెందిన ఎర్రగొండ నాగయ్య(45), ఆటో డ్రైవరుతో పాటు ఎనిమిది మంది మండలంలోని ఆర్.కొత్తపల్లె గ్రామంలో ఆదివారం పాముకాటుతో మృతి చెందిన గురుమోహన్ అంత్యక్రియలకు వెళ్లి ఆటోలో తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవరు పక్కన కూర్చున్న ఎర్రగొండ నాగయ్యపై ఆటో పడటంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ముగ్గురికి గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి అన్న రామసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ బాబు సోమవారం తెలిపారు.

చికిత్స పొందుతూ..

అవుకు, న్యూస్‌టుడే: అవుకు సమీపంలో ఈనెల 25న జరిగిన రహదారి ప్రమాదంలో గాయపడిన మర్రికుంట తండా వాసి రాముడునాయక్(30) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. రాముడునాయక్ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బనగానపల్లికి వెళ్తుండగా అవుకు సమీపంలోని బీసీ వసతి గృహం సమీపంలో ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. తలకు బలమైన గాయాలు తగలడంతో చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించారు. మృత్యువుతో పోరాడి తనువు చాలించినట్లు వెల్లడించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైకాపా నేతలవి మొసలి కన్నీళ్లు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: గత ఐదేళ్లలో ఏనాడూ రైతులను పట్టించుకోని వైకాపా నాయకులు నేడు వారి కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఎద్దేవా చేశారు. సోమవారం నంద్యాలలో కేసీ కెనాల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సు కోసం ఓ వైపు తాము పరితపిస్తుంటే మరోవైపు రైతుల శ్రేయోభిలాషులమంటూ వారు ప్రచార నాటకాలు ఆడుతున్నారన్నారు. జిల్లాలోని 150 చెరువులను త్వరలోనే నింపుతామన్నారు. వైకాపా నేత శిల్పా రవి రైతులపై ప్రేమచూపిస్తున్నట్లు నాటకాలు ఆడుతుంటే మరోవైపు శిల్పా వెంచర్ పేరుతో ఎంతో మంది రైతుల కన్నీటికి వారి కుటుంబమే కారణమవుతోందన్నారు. స్థానిక సమస్యలపై వైకాపా నాయకులకు ఏ మాత్రం అవగాహన లేదన్నారు. ఆళ్లగడ్డ వైకాపా నాయకులు నిద్రపోతున్నారన్నారు. ఇక్కడ ప్రతిపక్షం, అధికారపక్షాల పాత్ర తామే పోషిస్తున్నామన్నారు. రేపో మాపో సాగు కాల్వలకు నీరు విడుదల కానుందని, ఆళ్లగడ్డలోని అన్ని చెరువులను నింపబోతున్నామన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, మంత్రులతో తాము సంప్రదించామన్నారు. ఈ దశలో వైకాపా నాయకులు అనవసరంగా హంగామా చేస్తున్నారన్నారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వర్షాభావ పరిస్థితులు వచ్చాయని, అందుకే నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వం చెబుతోందన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

సాగు, తాగునీరు అందించాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయంలో నీరు ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగు నీటిని అందించడం లేదని వెంటనే నీటిని విడుదల చేయాలని వైకాపా మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని కలెక్టరేట్ వద్ద సోమవావారం రైతులతో కలిసి చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులలో కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలం అయిందన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూపడం లేదని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. రెండు, మూడు రోజుల్లో నీరందిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నాయకులు పీపీ నాగిరెడ్డి, నంది రైతు సమాఖ్య అధ్యక్షులు రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీలో వైకాపా నాయకులు

మట్టి వినాయకులను పూజించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చిన్న మట్టి వినాయకులను పూజించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. డీఆర్వో రామునాయక్, నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. . జిల్లాలోని ఆర్డీవోలు, డీఎస్పీలు, డివిజన్ స్థాయి అధికారులు తమ ప్రాంతాల పరిధిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. వినాయక నిమజ్జనం తేదీలను బట్టి పోలీసులతో సమన్వయం చేసుకుని నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు.

ఆలయాభివృద్ధికి రూ.5 లక్షల విరాళం

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి హైదరాబాదుకు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు రూ.5 లక్షల విరాళాన్ని అందించినట్లు ఆలయ ఛైర్మన్ మౌళీశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం విరాళం చెక్కును అందజేసినట్లు వెల్లడించారు.

నల్లమల అడవిలో ప్రమాదానికి గురైన లారీ

మహానంది, శిరివెళ్ల, న్యూస్‌టుడే : మహానంది, శిరివెళ్ల మండలాల పరిధిలోని నల్లమల అడవిలో నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిపై ఇనుప కడ్డీల లోడ్‌తో వస్తున్న లారీ ప్రమాదానికి గురైంది. దిమ్మెల మలుపులో వేగనియంత్రిక వద్ద డ్రైవర్ బ్రేకులు వేయడంతో ఇనుప కడ్డీలు లారీ క్యాబిన్‌లోకి చొచ్చుకొచ్చాయి. క్యాబిన్‌లోని వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. రహదారి భద్రతా పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

చట్టం పరిధిలో బాధితులకు న్యాయం చేస్తాం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ సునీల్ షొరాణ్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 98 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని ఎస్పీ సునీల్ షొరాణ్ బాధితుల నుంచి స్వయంగా స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదుల పట్ల అలసత్వం వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సునీల్ షొరాణ్

(c) eenadu

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

నంద్యాల గాంధీ చౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం తెలుగుపేటలో ఉన్న ఘణ మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నవనరసింహ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ, సుదర్శన్ పెరుమాళ్ల ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం యంత్రాలకు విశేష అభిషేకం, కలశారాధన, నిత్య హోమా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి, కలశ సంప్రోక్షణ, అన్నప్రసాద వితరణ జరిపించారు. ఈ కార్యక్రమాలు నిర్వాకులు మధుసూదన్, ఆలయ అర్చకులు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. భక్తులకు అర్చకులు ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

నేడు నాగలూటిలో ఎమ్మెల్యే పర్యటన

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మిడుతూరు మండలంలోని నాగలూటి గ్రామంలో మంగళవారం నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, ధోబీ ఘాట్ ప్రారంభించనున్నారు. పింఛన్ల పంపిణీ, ఇంటింటి తెదేపా కార్యక్రమంలో పాల్గొంటారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 8008573755
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని అరుంధతినగర్‌లో, సాదిక్‌నగర్ కాల్వలు శుభ్రం చేయడం లేదు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం - **పవన్‌కుమార్, మనోహర్, స్థానికులు** ?: పట్టణంలోని సింగ్ కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉంది. - **శివరాం, స్థానికుడు** ✓: కాల్వలు శుభ్రం చేయించి, ఫాగింగ్ చేయిస్తాం. కుక్కలను పట్టిస్తాం. - **శివప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండలంలోని మద్దూరు గ్రామంలో దోమల బెడద ఎక్కువై ఇబ్బందులు పడుతున్నాం - **ఏసురత్నం** ?: మండల కేంద్రం పాణ్యంలో గడ్డంపేటలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు - **రంగయ్య** ?: పాణ్యం బస్టాండ్ సమీపంలో పందుల బెడద ఎక్కువైంది. గుంపులుగా దుకాణాల వద్దకు వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం - **జాకీర్** ✓: మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తాం, దోమల మందు పిచికారి చేయిస్తాం. పందులను గ్రామానికి దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకుంటాం - **వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవో, పాణ్యం**

క్రీడల్లో సత్తా చాటాలి

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటాలని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ అండర్-17 బాక్సింగ్ పోటీల్లో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు చిరంజీవి, మోహన్ కృష్ణ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. సోమవారం మండలంలోని వేల్పనూరు గ్రామంలో ఉత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులను ఎమ్మెల్యే బుడ్డా అభినందించారు. వారికి ధ్రువపత్రాలు, మెడల్స్ అందజేశారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన చెంచు మహిళలు

ఆత్మకూరు, వెలుగోడు, న్యూస్‌టుడే: రాఖీ వేడుకల్లో బాగంగా వేల్పనూరులోని ఎమ్మెల్యే బుడ్డా స్వగృహం వద్ద వెలుగోడు చెంచు మహిళలు రాఖీ కట్టి వేడుకలు నిర్వహించారు. మిఠాయిలు తినిపించారు.

కేసీ కాల్వకు నీటిని విడుదల చేయాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : ముచ్చుమర్రి కేసీ ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కాల్వకు నీటిని విడుదల చేయాలని సీపీఐ నాయకుడు రఘురామ్ మూర్తి డిమాండు చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద, కేజీ రహదారిపై కేసీ రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. నీరు లేక కేసీ ఆయకట్టు కింద పంటలు ఎండిపోతున్నాయని, నికర జలాలను అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఇంఛార్జి తహసీల్దారు గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

విస్తరణ లేక.. ట్రాఫిక్ కష్టాలు

పార్కురోడ్డులో ట్రాఫిక్‌లో నిలిచిన వాహనాలు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో రహదార్లు కుదించుకుపోయాయి. ఏళ్ల తరబడి విస్తరణ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నా నిరాశే ఎదురవుతోంది. నంద్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత నిత్యం వేల సంఖ్యలో వాహనాలతో పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వస్తున్నారు. పట్టణంలో దాదాపు 3 లక్షలు జనాభా ఉంది. అందుకు తగినంత రహదార్లు లేకపోవడం, ఉన్నవి ఆక్రమణలకు గురవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

● బస్టాండ్ నుంచి బైరమల్ వీధి, పెద్ద బండ నుంచి బంగారు అంగళ్ల మీదుగా ప్రధాన రహదారి గాంధీచౌక్, గాంధీచౌక్ నుంచి పార్కురోడ్డు మీదుగా చెరువు కట్ట వరకు శ్రీనివాస సెంటర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు విస్తరించాల్సి ఉంది.

గతంలో ఇలా

గతంలో నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ నుంచి బైరమల్ వీధి, బంగారు అంగళ్ల వీధుల మీదుగా బస్సులు ఎదురెదురుగా వెళ్లినా ఇబ్బంది లేకుండా ఉండేది. నంద్యాల ఆత్మకూరు, శ్రీశైలం, మహానంది, వెలుగోడు బస్సులు ఈ వీధుల వెంట నడిచేవి. కాలక్రమేనా రహదార్లు ఆక్రమణలకు గురికావడం, రహదార్లపై నిర్మాణలు చేపట్టడంతో ఆటోలు తిరగడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు.

బైరమల్ వీధిలో నరకమే

బైరమల్ వీధిలో నిత్యం 25 వేల నుంచి 30 వేల మంది వివిధ పనుల కోసం వస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే వ్యాపార సమూదాయాలతో వాహనాల రాకపోకలకు, నడిచి వెళ్లేందుకు కూడా అవస్థలు తప్పడం లేదు. రహదార్లపైనే వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడం, దుకాణాలు నిర్మించడంతో అత్యవసరమైతే అంబులెన్స్ కూడా వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. స్థానికంగా నివాసం ఉన్న వాళ్లకు ఆటోలో ఇంటికి చేరాలంటే చాలా సమయం పడుతోంది. ఒక్కోసారి పెద్ద సంఖ్యలో వాహనాలు రావడంతో గంటల తరబడి ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి.

వెళ్లాలంటే భయమే..

నంద్యాల పట్టణంలోని బస్టాండ్ నుంచి బంగారు అంగళ్ల వీధి మీదుగా గాంధీచౌక్‌కు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. రహదారి కుచించుకుపోవడం, వాహనాలు రహదార్లపైనే అడ్డుగా పెట్టడం కనీసం ఆటో కూడా వెళ్లడానికి అవస్థలు తప్పవు. గాంధీచౌక్ నుంచి పార్కురోడ్డు మీదుగా ఆత్మకూరు బస్టాండ్ వరకు ఇదే పరిస్థితి నెలకొంది.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

మంత్రి ఫరూక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌పై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని రజక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారికి సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత ధోబి మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షులు జిల్లెల్ల శ్రీరాములు, జిల్లా కన్వీనర్ సుబ్రహ్మణ్యం, నాయకులు నాగరాజు, హరి, సంజీవరాయుడు, శీను, చలమరాజు, రామచంద్రుడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పూడిక పేరుకుపోయి.. రోగాలు పెరిగిపోయి

పాత బస్టాండు నుంచి దుద్యాల వెళ్లే మార్గంలో ఉన్న కచ్చా కాల్వ పూడికతో నిండిపోయింది. మట్టి కాల్వ కావటంతో మురుగు మట్టి పేరుకుపోయి నీళ్లు ప్రవహించడం లేదు. దీంతో దుర్వాసన రావడంతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి వేళల్లో దోమల వల్ల చిన్న పిల్లలు తరచూ రోగాల బారినపడుతున్నారు. ఈ కాల్వ ప్రధాన రహదారిని ఆనుకుని ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. - న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

చెరువు నిండక.. దాహం తీరక

వర్షాలు కురవాల్సిన తరుణమిది ఇంతవరకు చినుకు జాడ లేదు నేల పదునుకాక విత్తుకు నోచుకోలేదు. ఎల్‌నినో ప్రభావంతో చెరువులు, కుంటలు, వాగులు, ఎండిపోయాయి. ఏనాడు ఎండిపోని నంద్యాల చిన్న చెరువు నీరు లేక భుమి ఎండిపోయి అత్యధిక విస్తీర్ణంలో బీటలు వారి నెర్రలిచ్చింది. ఎలినినో ప్రబావం రోజు రోజుకు అధికమవుతోంది. రైతులకు అందోళన కలిగిస్తోంది.
- న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

అల్లుకున్న ప్రమాదం

నంద్యాల పట్టణ శివారులలో ఎస్సార్‌బీసీలో ఉన్న టిడ్కో ఇండ్ల మధ్య విద్యుత్తు స్తంభానికి తీగలు పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. స్తంభం నిండా పిచ్చిమొక్కలు తీగలు దట్టంగా అల్లుకోవడంతో ఎప్పుడు షార్ట్ సర్క్యూట్ జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలని ప్రజలు కోరుకుంటున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

మురుగు పొంగి.. ఇళ్లలోకి చేరి

నంద్యాల పట్టణం బొగ్గులైన్‌లో కాల్వ పొంగి మురుగు రహదారులపై, ఇళ్లలోకి పారుతోంది. దీంతో స్థానికులు దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం నెలకొని తరచూ రోగాలభారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మురుగు పొంగ కుండా కాల్వలు వెడల్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

కార్మికులకు బకాయిలు చెల్లించాలి

కొత్తపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ దినేష్, వ్యకాస జిల్లా నాయకులు స్వాములు తెలిపారు. బకాయిలు చెల్లించాలని కోరుతూ సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయ అధికారికి కార్మికులు వినతి పత్రం అందజేశారు.

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికుల జీతాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు రత్నమయ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు పద్మావతికి అందజేశారు.

సంక్షిప్త సమాచారం

పదవీ విరమణ: వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు మండల తహసీల్దారు శ్రీనివాస గౌడ్ పదవీవిరమణ పొందారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తహసీల్దారుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు అధికారులు, నాయకులు ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించి వీడ్కోలు పలికారు.

పల్లకిసేవలో మహానందీశ్వరుడు: మహానంది, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహానందిలో దేవస్థానం ఆధ్వర్యాన సంప్రదాయం ప్రకారం నిర్వహించే పల్లకిసేవలో గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లు విహరించారు. సోమవారం రాత్రి ఆలయ వేద పండితులు శాంతారామ్ భట్, రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత రాయశర్మ, అర్చకులు ధర్మతేజ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మల్లమ్మకు విశేష పూజలు: సున్నిపెంట సర్కిల్, శ్రీశైలం, న్యూస్‌టుడే : ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైల మహాక్షేత్రంలోని హేమారెడ్డి మల్లమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు అర్చకులు గురుపాదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నడ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ సేవతోనే ఉద్యోగికి కీర్తి: మహానంది, న్యూస్‌టుడే: మహానంది దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన వి.లక్ష్మీనారాయణతోపాటు మండలంలోని ఉల్లిగడ్డల బొల్లవరం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్ పదవీ విరమణ పొందారు. సోమవారం దేవస్థానం అలంకార మండపంలో ఏఈవో ఎర్రమల మధు, పర్యవేక్షకులు అంబటి శశిధరరెడ్డి, ప్రోటోకాల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, బొల్లవరంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయుడు చిన్నికృష్ణుడు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఉత్తమ సేవలే ఉద్యోగికి కీర్తి కిరీటాలని వారి సేవలను కొనియాడారు.

సుదీర్ఘ కాలం సేవలందించడం అభినందనీయం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: సుదీర్ఘకాలం పోలీస్‌శాఖకు సేవలందించడం అభినందనీయమని ఎస్పీ సునీల్ షొరాణ్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందుతున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు రామచంద్రసింగ్, ఎస్.కృష్ణలను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమమే లక్ష్యం

రక్తదానం చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సునీల్ షొరాణ్ అన్నారు. సోమవారం స్థానిక పద్మావతినగర్‌లోని నంద్యాల ఐఎన్‌ఐటీసీలో ఉచిత మెడికల్ శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వంద మందితో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఖాదర్ బాషా, ఏఆర్ ఏఎస్పీ చిన్నికృష్ణ, వెల్ఫేర్ ఆర్ఐ విజయ నరసింహ, సీఐలు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పాఠశాలకు భూమిపూజ

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రుద్రవరం గ్రామంలో నూతన ప్రభుత్వ పాఠశాల నిర్మించడానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య భూమిపూజ చేశారు. అనంతరం ఇంటింటికి తెదేపా కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాలు సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తెదేపా మండల యువనాయకులు కరింబాషా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ వసతి గృహాలను ప్రారంభించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి జనవికాస్ కార్యక్రమం కింద నంద్యాలలో నిర్మించిన 4 మైనార్టీ వసతి భవనాల పనులు పూర్తి చేసి, విద్యార్థుల కోసం వాటిని త్వరగా ప్రారంభించాలని ముస్లిం ఐకాస కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది, గౌరవాధ్యక్షులు మహమ్మద్ అబులైస్ డిమాండ్ చేశారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో నంద్యాల ముస్లిం ఐకాస నాయకులు కలెక్టర్ జి.రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉర్దూ జూనియర్ కళాశాల, సద్భావన భవనం పనులు నిర్ణీత సమయంలో ప్రారంభించకపోవడంతో వాటికి మంజూరైన నిధులు వెనక్కి వెళ్లినట్లు తెలిపారు. మైనార్టీ విద్యార్థుల కోసం నిర్మించిన వసతి గృహాలను ఇతర వాటికి వినియోగించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అన్సర్ బాషా, కరీముల్లా, ఆయూబ్, బషీర్ అహమ్మద్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుల ఆత్మీయ సమావేశం

వేదికపై సమావేశమైన పూర్వ విద్యార్థులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన పి.పి.పి.ఎస్.ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం 2002-03 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సమావేశమయ్యారు. పాఠాలు బోధించిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. బాల్య మిత్రుల చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. క్రీడలు, సరదా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వెంకటరెడ్డికి తెదేపా నేతల శుభాకాంక్షలు

గౌరు వెంకటరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా నాయకులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : పట్టణంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత భర్త గౌరు వెంకటరెడ్డి పుట్టినరోజు వేడుకలను తెదేపా శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్నా క్యాంటిన్‌లో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. బ్రాహ్మణకొట్కూరులోని ఆయన నివాసంలో నంద్యాల పార్లమెంట్ బాధ్యుడు మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం తెదేపా శ్రేణులు గౌరు వెంకటరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

సిద్ధవటం ఆలయం వద్ద ప్రతిష్ఠిస్తున్న ధ్వజస్తంభం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలం దత్తత ఆలయమైన కడప జిల్లాలోని సిద్ధవటంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, సభ్యుడు చిట్టిబొట్ల భరద్వాజ శర్మ, ఈవో ఎం.శ్రీనివాసరావు దంపతుల నేతృత్వంలో ప్రతిష్ఠ క్రతువులు చేశారు. ఈ సందర్భంగా శ్రీశైల దేవస్థానం వేద పండితులు, ప్రధానార్చకులు ధ్వజస్తంభ యంత్రాలకు పూజలు చేశారు. వేదపండితుల వేదమంత్రోచ్చరణల మధ్య నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ శిఖరాలపై నూతన కలశాలను సైతం ప్రతిష్ఠించారు. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధ్వజస్తంభ ప్రతిష్ఠను తిలకించారు. ఈ సందర్భంగా ఛైర్మన్, ఈవో మాట్లాడుతూ... సిద్ధవటం- జ్యోతి ఆలయాలను దశలవారిగా అభివృద్ధి చేస్తామన్నారు. భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించి, మరింత ప్రచారం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రం ముందు నిరసన

కొత్తపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని శింగరాజుపల్లె గ్రామం హరిజన వాడ కాలనీవాసులు సోమవారం అంగన్‌వాడీ కేంద్రం ముందు నిరసన చేశారు. ఆగస్టు 14వ తేదీన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టును భర్తీ చేశారు. అయితే అప్పటి నుంచి తమ కాలనీ వారికే ఆయా పోస్టు కేటాయించాలని, ఇతరులకు ఇవ్వొద్దని నిరసన చేస్తున్నారు.

నిరసన చేస్తున్న కాలనీవాసులు

పైపులైనుకు మరమ్మతులు చేపట్టండి

కొత్తపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పనుల్లో భాగంగా మండలంలో శివపురం ఎత్తిపోతల పథకం ప్రధాన పైపులైను దెబ్బతినడంతో మరమ్మతులు చేపట్టాలని రైతులు నిరసన చేశారు. సోమవారం శింగరాజుపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి 167కె నిర్మాణ పనులను రైతులు అడుకున్నారు. పైపులైను దెబ్బతినడంతో నీరు వృథాగా పోతున్నాయని, వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన చేశారు. దీంతో మళ్లీ సమస్య లేకుండా మరమ్మతులు చేయిస్తామని ఎస్సై జయశేఖర్ రైతులకు చెప్పడంతో నిరసన విరమించారు.

నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం, కృష్ణా జలాల సవ్వడి నీటి ముంపు నిర్వాసితుల త్యాగ ఫలితమే అని సంఘం నాయకుడు జయ్యన్న తెలిపారు. 98 జీవో అమలు కోసం నీటి ముంపు నిర్వాసితులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష సోమవారం 159వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఉద్యోగాలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం జీవో 98 మేరకు శ్రీశైలం ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోయిన బాధితులకు కూడా ఇవ్వాలని కోరారు.

కత్తితో దాడి.. ముగ్గురికి తీవ్రగాయాలు

గడివేముల, న్యూస్‌టుడే: గడివేములలో చిన్నరాయుడు అనే వ్యక్తి సోమవారం రాత్రి కత్తితో వీరంగం చేశాడు. ప్రధాన రహదారిలోని మద్యం దుకాణం సమీపంలో వరుసకు సోదరులైన సురేష్, రాజు, లక్ష్మన్నపై దాడి చేసి కత్తితో పొడిచినట్లు స్థానికులు తెలిపారు. ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డవారిని గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం నంద్యాల ఆస్పత్రికి తరలించారు. దాడికి కారణాలు తెలియరాలేదు. సంఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రధానరహదారిలో కత్తితో వీరంగం చేయడంతో అటువైపు వెళుతున్న వారు, దుకాణదారులు భయాందోళనలకు గురయ్యారు.

యువకుడికి జైలు శిక్ష

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన షేక్ ఫయాజ్‌కు ఏడు రోజులు జైలు శిక్ష పడినట్లు ట్రాఫిక్ సీఐ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. శ్రీనివాసనగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా షేక్ ఫయాజ్ బ్రీత్ అనలైజర్ పరీక్షలో అధిక మొతాదులో మద్యం తాగినట్లు తేలింది. యువకుడిని న్యాయస్థానంలో హాజరు పరుచగా స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్‌క్లాస్ న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. ఇటువంటి వాటికి పాల్పడితే చట్టపరమైన చర్యలు త్పవని పోలీసులు హెచ్చరించారు.

సాగు నీరు ఇవ్వాలి

పగిడ్యాల, న్యూస్‌టుడే: ఎండుతున్న పొలాలకు సాగునీరు అందించాలని వైకాపా మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ముచ్చుమర్రి హంద్రీనివా సుజల స్రవంతి ఎత్తిపొతుల ప్రాజెక్టు వద్ద వైకాపా నాయకులు, రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎండిపోయిన పంటలను కాపాడుకోవాలంటే కేసీ కాల్వకు నీరు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పగిడ్యాల మాజీ సర్పంచి పెరుమాళ్ల శేషన్న, ముచ్చుమర్రి మాజీ సర్పంచి ఆంజనేయులు, చంద్రారెడ్డి, పులింద్రనాయుడు, పాలూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో దేశానికి ఖ్యాతి

మహానందిఫారం, (మహానంది), న్యూస్‌టుడే: క్రీడలతో దేశానికి ఖ్యాతి పెరుగుతోందని అసోసియేట్ డీన్ డాక్టర్ చవన్ శ్యామ్‌రాజ్ నాయక్ పేర్కొన్నారు. మహానంది ఫారంలోని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాలలో సోమవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ధ్యాన్‌చంద్ హాకీ ఆటలో సాధించిన కీర్తిని వివరించారు. విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.

నూతన విద్య.. చిన్నారుల భవితకు రక్షణ

అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బొమ్మల ఛార్టు ద్వారా విద్యాబోధన

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు జ్ఞాన జ్యోతి కార్యక్రమానికి రూపకల్పన చేసింది. చిన్నారులు ఆడుతూ పాడుతూ ఆంగ్ల భాషను నేర్చుకునేలా రూపొందించిన ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆంగ్ల ఉచ్చారణ, సంభాషణ, పిల్లలను అలరించే రీతిలో పాటలు పాడించడంపై సమగ్ర శిక్షణ ఇచ్చారు. వారు పిల్లలకు డిజిటల్ పాఠాలు బోధిస్తున్నారు. డిజిటల్ కంటెంట్, బొమ్మల చార్టులు, ఆడియో-విజువల్ సాధనాలను ఉపయోగించి అంగన్‌వాడీ సెంటర్లలో బోధన సాగుతోంది.

● నంద్యాల ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు 295 ఉన్నాయి. వీటిలో 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు 11,735 మంది, 3-6 ఏళ్ల లోపు పిల్లలు 11,255 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండు విడతల్లో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించి బోధన సామగ్రి అందజేశారు. వీరు పిల్లలకు డిజిటల్ పాఠాలు బోధించనున్నారు.

బాలల వికాసానికి..

నేటి పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా డిజిటల్ తెరలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన చేయనున్నారు. డిజిటల్ సామగ్రి, పరికరాలను ప్రభుత్వం సమకూర్చనుంది. బాలల సంపూర్ణ వికాసానికి దోహదం చేసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. కృత్యాలతో అభ్యసన తరగతులు నిర్వహించనున్నారు. చిన్నారుల్లో వైవిధ్యాన్ని గుర్తించి ప్రోత్సహించనున్నారు. చిన్నారులు తెలుగుతోపాటు ఆంగ్లంపై పట్టు సాధించేలా పాఠాలు బోధించనున్నారు. శ్రమణ విధానం ద్వారా పిల్లలు సులభంగా పదాలను గుర్తించేలా ప్రత్యేక ఆంగ్ల గేయాలను ప్రవేశపెట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం

జ్ఞానజ్యోతి అమలులో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని కీలకంగా చేశారు. బాలలకు బోధించే అంశాలపై వారికి అవగాహన కల్పించడంతో పాటు ప్రతి నెలా వారి అభ్యసన స్థాయిని తెలియజేస్తారు. నెలవారీ సమావేశాలు ఏర్పాటు చేసి చిన్నారుల ఎదుగుదల, పోషకాహారం అందించడం, ఇళ్ల వద్ద శిక్షణ తదితర ప్రక్రియల్లో వారిని భాగస్వాములను చేయనున్నారు. ప్రతి కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

ఎంతో ఉపయోగపడుతుంది

- రామసుబ్బమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త

అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలకు వెళ్లే చిన్నారులు తెలివి తేటలు, చదువు, ఆట పాటల్లో రాణించడం కోసం జ్ఞానజ్యోతి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది. బాల్య దశలో అంగన్‌వాడీ కేంద్రంలోనే బాలల శారీరక, మానసిక, సామాజిక భాష, మేధస్సు అభివృద్ధి ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు. పిల్లలకు పాఠాలు బోధించడానికి మెటీరియల్ అందజేశారు.

In the Court of the Prl. Dt. Judge Kurnool.

O.P.No: 40/2026

Pareddy Manasa -Petitioner
Vs
Nill -Respondent

జనరల్ నోటీసు

నంద్యాల జిల్లా, నందికొట్కూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, నందికొట్కూరు గ్రామ ప్రజలకు తెలియజేయడము ఏమనగా మైనెంబర్ O.P.లో 1) పారెడ్డి పూజిత, 2) పారెడ్డి హర్షిత, మైనర్లుగా ఉన్నారని మైనర్ల పేర ఉన్న షెడ్యూలు ఆస్తిని మైనర్ల సంరక్షణ కొరకు విక్రయించుటకు పర్మిషన్ ఇప్పించమని కోరుతూ పై కోర్టులో అర్జీ దాఖలు చేసినది. ఇందుపైన ఎవరికైన ఆక్షేపణ ఉన్న 05-10-2026 తేదీన పగలు 10:30 గం.కు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

షెడ్యూలు: నంద్యాల జిల్లా, నందికొట్కూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, నందికొట్కూరు గ్రామము, సర్వే నెం-783, పైకి 2 ఎకరములు. **తూర్పు**- రస్తా, **పడమర**- అర్జీదారు మిగిలిన భూమి, **ఉత్తరము**- ఇస్మాయిల్ భూమి, **దక్షిణం**- లక్ష్మీప్రసాద్ భూమి.

కోర్టువారి ఉత్తర్వు మేరకు
S.V.కృష్ణారెడ్డి
S.తనూజ్ రెడ్డి
అర్జీదారుపరం అడ్వకేట్లు
కర్నూలు. Cell: 98484 08642

(c) eenadu

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

చైతన్యమనోరాజ్

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలోని జేబీవీస్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఆగస్టు 29, 30వ తేదీల్లో జరిగిన రీజనల్ సెలెక్షన్ పోటీల్లో డోన్ తపాలాశాఖలో ట్రెజరర్‌గా పనిచేస్తున్న ఎ.చైతన్య మనోరాజ్ 45 ప్లస్ విభాగంలో పాల్గొని తన సత్తాచాటి ఏపీ సర్కిల్ తరఫున ఎంపికైనట్లు డోన్ తపాలాశాఖ పోస్టుమాస్టర్ కృష్ణా నాయక్ సోమవారం తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నవంబరు 11 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత తపాలా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆయన పాల్గొననున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆయన ఎంపికపై పోస్టుమాస్టర్‌తో పాటు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

వినాయక ఘాట్‌లో శుభ్రత పనులు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల పట్టణ సమీపంలో కర్నూలు రహదారిలో ఉన్న వినాయక ఘాట్‌ను కేంద్ర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం శుభ్రం చేశారు. సెప్టెంబరు 14 నుంచి జరిగే వినాయక చవితి సందర్భంగా నిర్వహించే విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కోనేరులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని యంత్రం సహాయంతో తొలగించి శుభ్రం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆళ్లగడ్డ: 8008 574916, డోన్ పట్టణం: 94408 57790, బనగానపల్లె: 80085 73763

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: శ్రీనివాసనగర్‌లో ప్రధాన రహదారి పక్కన రెండు దీపాలు వెలగడం లేదు. సిబ్బంది పట్టించుకోవటం లేదు. - **సోమన్న, శ్రీనివాసనగర్** ✔: కొత్త దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - **సురేష్, మున్సిపల్ ఏఈ**

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: యర్రగుంట్ల, శిరివెళ్ల గ్రామాల్లోని ఉద్యా పాఠశాల ఆవరణలో రాత్రి సమయాల్లో ఆకతాయిలు మద్యం తాగుతున్నారు. - **రాంపుల్లయ్య, స్థానికుడు.** ✔: రాత్రి సమయాల్లో పోలీసు గస్తీ పెంచుతాం. - **మధుసూదన్, ఎస్సై, శిరివెళ్ల.**

కోవెలకుంట్ల (గ్రామీణం), న్యూస్‌టుడే: ?: బస్టాండ్ నుంచి ఎల్లమ్మ గుడి వరకు ప్రధాన రహదారిలో పలు వీధుల్లో వీధి దీపాలు వెలగడంలేదు. - **దస్తగిరి, స్థానికుడు.** ✔: పరిశీలించి బాగుచేయిస్తాం. - **ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జీ ఈవో.**

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోటకందుకూరు గ్రామంలో ఎన్టీఆర్ కాలనీలో దోమల బెడద అధికంగా ఉంది. - **రమేష్, కోటకందుకూరు.** ✔: దోమల నివారణ మందులు పిచికారీ చేయిస్తాం. - **నూర్జహాన్, ఎంపీడీవో.**

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆళ్లగడ్డ రజక సంఘం అధ్యక్షుడు సి.రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రజక సంఘం నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతో వెనుకబడిన తమను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. రజకుల నివాసాలకు సైతం ఉచితంగా విద్యుత్తు ఇవ్వాలన్నారు.

కంటి అద్దాల పంపిణీ

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని మార్కెట్ యార్డు ఆవరణలో జులై 25 నుంచి 31 వరకు శంకర నేత్రాలయ, సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శస్త్రచికిత్సలు చేయించుకున్న 37మందితోపాటు మరో 100మందికి సోమవారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. రామశంకర్‌రెడ్డి, రంగారెడ్డి, నాగేశ్వరరెడ్డి, జితేంద్రారెడ్డి పాల్గొన్నారు.

అద్దాలను పంపిణీ చేస్తున్న సేవా సంస్థ సభ్యులు

ఎండిన బోర్లు.. నీళ్లు రాని కుళాయిలు

● గ్రామాల్లో దాహం కేకలు

ఉప్పలపాడు శివారులోని వ్యవసాయ బోర్ల నుంచి ఎడ్ల బండిపై నీటిని తీసుకొస్తున్న గ్రామస్థుడు

అవుకు, సంజామల, కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: అవుకు మండలంలో తాగు నీటి కష్టాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రత్యేకించి కొండమీది గ్రామాల్లో పరిస్థితి దారుణంగా మారింది. ఉప్పలపాడు, కొండమనాయునిపల్లె, పిక్కిళ్లపల్లె తండా, మన్నేనాయక్‌తండాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పరంగా బోర్లు వేసి ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించి కుళాయిలను ఏర్పాటు చేశారు. అన్నీ ఉన్నా ప్రస్తుతం బోర్లలో నీళ్లు లేకుండా పోయాయి.

సమస్య ఎక్కడెక్కడంటే..

❐ ఉప్పలపాడులో దాదాపు 2,500 జనాభా నివసిస్తోంది. ఇక్కడ గత నెలరోజులుగా సమస్య కొనసాగుతోంది. అసలే అంతంత మాత్రంగా తాగునీటి వసతి ఉన్న గ్రామంలో ప్రస్తుత వర్షాభావంతో బోర్లు ఒట్టిపోయాయి. అంతంత మాత్రంగా వచ్చేనీళ్లు ప్రజల అవసరాలకు ఏమాత్రం సరిపోవడంలేదు. ప్రైవేటు శుద్ధజల కేంద్రం వద్ద వృథాగా వెళ్లే నీటిని కొందరు బిందెలకు నింపుకొని గృహావసరాలకు తీసుకెళ్తున్నారు. మరి కొందరు గ్రామం వెలుపల గల వ్యవసాయ బోర్ల నుంచి ఎడ్ల బండ్లు, ద్విచక్ర వాహనాల ద్వారా తెచ్చుకునే పరిస్థితి కొనసాగుతోంది. ఎస్సీ కాలనీ, ముస్లింవీధిలో సమస్య తీవ్రంగా ఉన్నట్లు ప్రజలు వాపోతున్నారు.

❐ కొండమనాయునిపల్లె, పిక్కిళ్లపల్లె తండాల పరిధిలో వారం రోజుల్లోనే భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయి. గ్రామం దాదాపు 30 బోర్లు ఉండగా.. ప్రస్తుతం చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. అరకొరగా వచ్చేనీళ్లు ప్రజల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. వ్యవసాయ బోర్లు ఆపివేశాక రాత్రి వేళల్లో నీటిని సమకూర్చుకుంటున్నారు.

నీటి ఎద్దడి నివారించాలని వినతి

సంజామలలో ప్రధాన రహదారిలో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో తాగునీటి గొట్టాలు పగిలిపోయాయి. పాలేరువాగులో నీటి అడుగంటింది. దీంతో గ్రామస్థులకు సురక్షిత తాగునీరు అందటం లేదు. అందుబాటులో ఉన్న చేతి పంపుల్లో వచ్చే ఉప్పునీటిని తాగి ప్రజలు దాహార్తిని తీర్చుకుంటున్నారు. దాతలు సమకూర్చిన ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నా అవి ఏమాత్రం సరిపోక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేరుసోములలో భూగర్భ జలాలు అడుగంటడంతో గ్రామస్థులకు తాగునీరు అందటం లేదు. కొలిమిగుండ్ల మండలంలోని మీర్జాపురం, గొర్విమానుపల్లె గ్రామాల్లోనూ ఇలాంటి పరిస్థితి నెలకొంది. అధికారులు చొరవ తీసుకొని నీటి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పురపాలికను 32వార్డులుగా విభజించామని కమిషనర్ పి.కిశోర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గతంలో 27 వార్డులు ఉండగా వాటిని 32కు పెంచామన్నారు. ఎన్నికల కోసం 64 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి వార్డులో రెండు పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. పురపాలికలో మొత్తం 35,452 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలో త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 19 గ్రామ పంచాయతీల పరిధిలోని 194 పోలింగ్ కేంద్రాల తుది జాబితాను కలెక్టర్ ఆమోదం తెలిపారని ఎంపీడీవో ఫజుల్‌రహిమాన్ వెల్లడించారు. జాబితాను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంతో పాటు మండలంలోని 19 పంచాయతీల్లో అందుబాటులో ఉంచారు. జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ పంచాయతీ పరిధిలోని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వచ్చిన అభ్యంతరాల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రహరీ లేక రక్షణ కరవు

అహోబిలం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహరీ సమస్య వేధిస్తోంది. విశాలమైన మైదానం ఉన్న ఈ పాఠశాలకు ప్రహరీ లేకపోవడం లోటుగా పరిణమించింది. రాత్రి సమయాల్లో ఆకతాయిలు మద్యం తాగి మైదానంలో నిర్మాణాలను ధ్వంసం చేస్తున్నారు. మరుగుదొడ్లు, నీటి ట్యాంకు కుళాయిలు నాశనమవుతున్నాయి. ఫలితంగా విద్యార్థులు ఆటలాడేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం**

నీరు కలుషితం.. రోగాల భయం

దొర్నిపాడు మండలం ఉమాపతినగర్ గ్రామంలోని కుంటలోని నీరు పచ్చగా మారి కలుషితమవుతోంది. ఐదేళ్లుగా కుంటను శుభ్రపరచ పోవటంతో నీరు అపరిశుభ్రంగా మారింది. దుర్వాసన వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామస్థులు ఆ నీటిని మోటార్ల సాయంతో పైపుల ద్వారా ఇళ్లకు సరఫరా చేసుకుంటున్నారు. దాదాపు 40 నుంచి 50 కుటుంబాలు ఆ నీటిని అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. పలు రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు నీటిని శుద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, దొర్నిపాడు**

ప్రమాదాల నివారణకు ఉపాయం

కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు నిర్ణీత వేగానికి మించి రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి సమయాల్లో జాతీయ రహదారి మరమ్మతులు, ఇతర పనులు చేసేందుకు కూలీలు చాలా ఇబ్బందులు పడేవారు. వీటిని దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారి నిర్వహణ ఏజెన్సీలు కూలీలు పనులు చేసే సమయాల్లో ప్రమాదాలకు గురికాకుండా అచ్చం మనిషిని పోలిన బొమ్మలను ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాల నివారణతో పాటు కూలీలు నిర్భయంగా పనులు చేసుకునే వీలు ఏర్పడింది. - **న్యూస్‌టుడే, శిరివెళ్ల**

నిత్యం పొగ.. ప్రజలకు వ్యధ

డోన్ పట్టణంలోని ఆర్టీసీ కొత్తబస్టాండు వద్ద భోజనశాల గొట్టం నుంచి వెలువడే పొగతో ఆ ప్రాంతమంతా కమ్ముకుంటోంది. ఎక్కడ గాలి వీస్తే అక్కడ పొగ చూరుతోంది. బస్టాండు లోపలికి సైతం పొగ వెళ్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ప్రజలకు ఇబ్బంది కల్గించే విధంగా పొగ కమ్ముకుంటున్నా..అధికారులు మిన్నకుండిపోతుండటం శోచనీయం. అధికారులు స్పందించి హోటల్ నుంచి పొగ వెలువడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - **న్యూస్‌టుడే, డోన్‌పట్టణం**

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నిందితులకు జైలు

బేతంచెర్ల, ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఓ వ్యక్తికి డోన్ న్యాయస్థానం రెండు రోజులు జైలు శిక్ష విధించింది. బేతంచెర్లకు చెందిన రామాంజనేయులుపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి డోన్ న్యాయస్థానానికి పంపించారు. విచారణ అనంతరం నిందితుడికి రెండు రోజుల జైలు శిక్షణ విధించినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. గూబగుండం సమీపంలో జాతీయ రహదారిపై ఎస్సై వరప్రసాద్ ఈ నెల 26వ తేదీన వాహనాల తనిఖీ చేశారు. శ్రీనివాసులు అనే వ్యక్తి మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఆళ్లగడ్డ స్పెషల్ మెజిస్ట్రేట్ రవికుమార్ సదరు వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

'ప్రొటోకాల్ మాకేనా.. మీకు వర్తించవా'

మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రొటోకాల్ ఉల్లంఘించి ప్రభుత్వ భవనంలోకి అక్రమంగా ప్రవేశించారని ఎంపీడీవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు జడ్పీ ఛైర్మన్‌తోపాటు మరి కొందరిపై పోలీసులు కేసు నమోదు చేయడం బాధాకరమని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎంపీడీవో భవనం ప్రారంభానికి సమయం కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. దగ్గరలో ఉన్న ఒక పెట్రోలు బంకు ప్రారంభోత్సవానికి వెళ్లారు కానీ.. ప్రభుత్వ కార్యాలయం ప్రారంభానికి సమయం ఉండదని ఎద్దేవా చేశారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రారంభిస్తే.. తప్పుడు కేసులు బనాయించడం సబబు కాదన్నారు. అక్రమంగా తాళాలు పగులగొట్టిన వారిపై కేసులు నమోదు చేయకుండా.. వైకాపా వారిపై కేసులు బనాయించడం ఏమిటని ప్రశ్నించారు.

సంక్షిప్త సమాచారం

లక్ష్యసాధనతో ముందుకు సాగాలి: డోన్, న్యూస్‌టుడే: లక్ష్యసాధనతో ముందుకు సాగితే జీవితంలో ఏదైనా సాధించవచ్చని గ్రామీణ ఎస్సై మమత పేర్కొన్నారు. సోమవారం నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణాత్మక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వృద్ధులకు చీరల పంపిణీ: డోన్, న్యూస్‌టుడే: వృద్ధుల పట్ల ఆదరాభిమానాలు చూపాలని దాత ప్రశాంత్ పేర్కొన్నారు. కర్నూలుకు చెందిన ప్రశాంత్ ఆయన సతీమణి వరలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు దుస్తులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు: కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: వెలగటూరు వద్ద సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో పెద్దకొప్పెర్ల గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి, పార్థసారథిరెడ్డిలకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన మధుపై కేసు నమోదైంది.

వేతన బకాయిలు చెల్లించాలి: డోన్, న్యూస్‌టుడే: చిన్నమల్కాపురం గ్రామ పంచాయతీలో కార్మికులకు రావాల్సిన 10 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు శివరాం కోరారు. సోమవారం ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

నేడు పింఛన్ల పంపిణీ: డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 15వ వార్డులో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

శ్రావణం.. ఆధ్యాత్మిక పరిమళం

ఆళ్లగడ్డ గ్రామీణం: పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బత్తలూరు గ్రామంలో సీతారామాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా విశేష పూజా కైంకర్యాలు నిర్వహించి స్వామి, విగ్రహాలను ప్రతిష్ఠించారు. సోమవారం శాస్త్రోక్తంగా యంత్ర అర్చన చేసి సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. హోమం నిర్వహించి మహాపూర్ణాహుతి గావించారు. స్వామి, అమ్మవారికి మహామంగళహారతి అందించి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణంలోని కాళికామాతాలయంలో శ్రావణ మాస పూజలు ఘనంగా జరిగాయి. సోమవారం వేకువజామునే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. తీర్థప్రసాద వితరణ జరిగింది.

ఆళ్లగడ్డ: పూజలందుకున్న కాళికామాత

ఆలయాభివృద్ధికి దాత విరాళం

విరాళాన్ని అందజేస్తున్న దాతలు

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి గోస్పాడు మండలం రాయపాడు గ్రామానికి చెందిన చిన్నవెంకట, ఈశ్వరి కుటుంబ సభ్యులు రూ.35 వేల విరాళాన్ని ఆలయ సిబ్బందికి సోమవారం అందజేశారు. అంతకుముందు దాతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

చాగలమర్రి: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

చాగలమర్రి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఫణీంద్రుడు తెలియజేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొన్నారు.

సంజామల, న్యూస్‌టుడే: అర్హులైన పేదలు, దివ్యాంగులకు పింఛన్ల మంజూరుకు అధికారులు చర్యలు తీసుకోవాలి భాజపా మండల నాయకులు చింతమాను చిన్నపెద్దన్న కోరారు. సంజామల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాజపా మండల నాయకులు ఆయన దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను వినతుల రూపంలో అధికారులు అందించారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్వరయ్య పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకే వినియోగించాలి

సంజామల, న్యూస్‌టుడే: ఎస్సార్బీసీ కాలువలకు వదిలిన నీటిని ప్రజలు తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని ఎస్సార్బీసీ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ మల్కిహుసేని పేర్కొన్నారు. బనగానపల్లి సమీపంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాలువ నుంచి 10 బ్లాక్‌కు కాల్వ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ సోమవారం ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో తాగునీటి అవసరాలు తీర్చేందుకు కాల్వకు నీటిని విడుదల చేయించారన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. నాయకులు మద్దిలేటి, వెంకటకృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, ఓబుల్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న మల్కిహుసేని తదితరులు

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని జ్ఞానాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను ఎంఈవో నయామతుల్లా సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల దస్త్రాలను పరిశీలించారు. అలాగే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తనిఖీ చేశారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. మెనూ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

గ్రామాలకు శుద్ధజలం సరఫరా

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: మాయలూరు సీపీడబ్ల్యూ స్కీం పరిధిలో ఉన్న నాలుగు గ్రామాలకు శుద్ధ జలం సరఫరా చేయటానికి చర్యలు తీసుకొంటున్నట్లు డీఈ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చొరవతో 16వ ఆర్థిక సంఘం కింద విడుదలైన రూ.9 లక్షల నిధులతో మాయలూరు పంపు హౌసు వద్ద ఏర్పాటు చేస్తున్న మైక్రోఫిల్టర్లను సోమవారం అధికారులు పరిశీలించారు.

మహిళా శక్తి.. ఆర్థిక వృద్ధి

శిరివెళ్ల, కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. తాము పొందిన రుణాలతో వ్యాపారాలు, జీవనోపాధి కార్యక్రమాలు చేపట్టి కుటుంబ పోషణకు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఒకవైపు కుటుంబ బాధ్యతలు మోస్తూనే మరోవైపు కుటుంబ పోషణలో తమవంతు పాత్ర పోషిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

చింత లేకుండా జీవిస్తున్నా - షేక్ తాహిరూన్, శిరివెళ్ల

నా పేరు షేక్ తాహిరూన్. మాది శిరివెళ్ల గ్రామం. నేను పదేళ్ల క్రితం పొదుపు సంఘంలో సభ్యురాలిగా చేరి.. ప్రస్తుతం లీడర్‌గా ఎంపికయ్యా. గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఫ్యాన్సీ స్టోర్‌తో పాటు నురానీ లేడీస్ కార్నర్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నా. పొదుపు సంఘం ద్వారా ఇటీవల రూ.1.50 లక్షల వరకు రుణం తీసుకుని వ్యాపారాన్ని మరింతగా అభివృద్ధి పరిచా. పెట్టుబడి పోనూ ప్రతి నెలా సుమారు రూ.20 వేలకు పైగానే ఆదాయం సమకూరుతోంది. చింత లేకుండా జీవిస్తున్నానని తాహిరూన్ చెబుతున్నారు.

కుటుంబానికి ఆసరాగా నిలిచా - ఆర్.విజయలక్ష్మి, కొలిమిగుండ్ల

నా పేరు ఆర్.విజయలక్ష్మి. మాది కొలిమిగుండ్ల గ్రామం. 25 ఏళ్ల క్రితం శ్రీలలితా సుందరేశ్వర పొదుపు సంఘంలో చేరా. క్రమం తప్పకుండా పొదుపు చేశా. మొదట రూ.50 వేలు బ్యాంకు రుణం తీసుకొన్నా. ఆర్టీసీ బస్టాండు సమీపంలో గది అద్దెకు తీసుకొని స్టేషనరీ దుకాణం ఏర్పాటు చేసుకున్నా. తీసుకున్న రుణం చెల్లించాక మళ్లీ బ్యాంకు ద్వారా రూ.15 లక్షల రుణం తీసుకొన్నా. గిఫ్ట్ ఆర్టికల్స్, లేడీస్ కార్నర్ దుకాణం ఏర్పాటు చేసుకొని నా కుటుంబ సభ్యుల సహకారంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొన్నా. నెలకు రూ.30 వేలు ఆదాయం వస్తోంది. కుమారుడు బీటెక్, కుమార్తె ఇంటర్మీడియట్ చదివిస్తున్నా. స్వయం ఉపాధితో కుటుంబానికి ఆసరాగా నిలిచానని విజయలక్ష్మి చెబుతున్నారు.

విద్యార్థుల ప్రతిభతోనే పురస్కారం

పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొర్నిపాడు, న్యూస్‌టుడే: ఆటల్లో విద్యార్థుల చూసిన ప్రతిభతోనే దొర్నిపాడు జడ్పీ పాఠశాలకు క్రీడా ప్రతిభ అవార్డు లభించిందని పాఠశాల హెచ్ఎం చెన్నకేశ్వరి సోమవారం పేర్కొన్నారు. స్థానిక పాఠశాలలో క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు తైక్వాండో, బేస్‌బాల్, హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా, సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో పతకాలు సాధించారన్నారు. ఈ క్రమంలోనే పాఠశాల నంద్యాల జిల్లాలోనే మూడో స్థానంలో నిలిచిందన్నారు. పీఈటీ దేవేంద్ర, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

21 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

కొలిమిగండ్ల, న్యూస్‌టుడే: మండలానికి 21 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ఎంపిక జరిగినట్లు ఎంఈవోలు శ్రీనివాసరెడ్డి, అబ్దుల్ కలామ్‌లు సోమవారం తెలిపారు. వీరిలో 16 మంది ఎస్టీటీలు, నలుగురు హిందీ పండిట్‌లు, ఎస్ఏ (ఇంగ్లిష్) ఒకరు ఉన్నట్లు వారు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు మంగళవారం రోజున వారికి కేటాయించిన పాఠశాలల్లో రిపోర్టు చేయాలన్నారు.

అరిస్తే అరవనీ.. కరిస్తే కరవనీ

▶ పెరుగుతున్న కుక్కకాట్లు

బేతంచెర్లలో రహదారిపై శునకాల గుంపు

బేతంచెర్ల, ప్యాపిలి, బనగానపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: వీధికుక్కల దాడికి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీధుల వెంట శునకాలను చూస్తే భయం వేసే పరిస్థితులు నెలకొన్నాయి. కుక్కల దాడులు తీవ్రరూపం దాల్చి మనుషుల మృతికి కారణమవుతున్నాయి. గాయాలపాలైన వారు చికిత్స కోసం ఆసుపత్రులకు వరుస కడుతున్నారు. పెంపుడు కుక్కల అరుపులను ప్రజలు భరించలేకున్నారు. దాడుల నియంత్రణలో యంత్రాంగం విఫలమవుతోంది.

గతేడాది ఇద్దరు చిన్నారుల మృతి

బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో గతేడాది మే 2న నాలుగేళ్ల మొహియుద్దీన్ అనే బాలుడు తోటి స్నేహితులతో ఇంటి బయట ఆడుకుంటుండగా 5 శునకాలు వెంబడించి దాడి చేశాయి. గొంతు, తల భాగాల్లో గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. బనగానపల్లి మండలం కైప గ్రామం ఎస్సీ కాలనీలో గతేడాది జులై 10వ తేదీన నాలుగేళ్ల చిన్నారి మధుప్రియ వీధిలో స్నేహితురాళ్లతో తినుబండారాలు తింటుండగా మూడు కుక్కలు దాడి చేశాయి. మెడ, చేతులు, కాళ్లలో గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ రెండు ఘటనలు సదరు తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది.

నాలుగు నెలల కాలంలో నమోదైన కుక్కకాట్లు

మండలం	మే	జూన్	జులై	ఆగస్టు
ప్యాపిలి	17	20	10	12
బేతంచెర్ల	91	106	60	70
బనగానపల్లి	20	22	25	27

చర్యలు తీసుకోవాలని వినతి

❐ బేతంచెర్ల పట్టణంలో సంజీవనగర్, హనుమాన్‌నగర్, కోటపేట, అల్లాబకాష్ దర్గా, ధరణీ టౌన్‌షిప్, కొత్తబస్టాండు, తహసీల్దార్ కార్యాలయం వీధి, ఎన్జీవో కాలనీ, దుర్గాపేట, రేగిమానుపేట, తహసీల్దార్ కార్యాలయం వీధి లైను తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. వీటికి సంతానోత్పత్తి కలగకుండా శస్త్ర చికిత్సలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పట్టణంలో రోజుకు నాలుగైదు కేసులు నమోదవుతున్నాయి.

❐ బనగానపల్లి మండలంలోని పలుకూరు, నందివర్గం, నందవరం గ్రామాల్లో శునకాలు రహదారులపై ఉండి వాహన చోదకులను వెంబడిస్తూ గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. ప్యాపిలి మండలంలోని కలుచట్ల గ్రామంలో వీధి కుక్కల సమస్య ఉంది. ప్యాపిలి పట్టణంలో బస్టాండు, లైబ్రరీ ఏరియా, కిందిగేరిలో శునకాల బెడద అధికంగా ఉంది. ప్రతి వీధిలో శునకాలు పదుల సంఖ్యలో సమూహాలుగా తిరుగుతున్నాయి.

LIC 70వ LIC ఫ్యార్మేషన్ డే శుభాకాంక్షలు
డోన్ నియోజకవర్గ LIC మేనేజర్ గారికి, ఏజెంట్లకు, మా కస్టమర్లకు, పాలసీదారులకు, మా శ్రేయోభిలాషులకు అందరికీ 70వ LIC ఫార్మేషన్ డే శుభాకాంక్షలతో...
అధ్యక్షుడు, సెక్రటరీ, ట్రెజరర్
DHONE LIC LIAFI